# కొలిమి

ఆ ఊరికి మొ(న)గాడు మల్లన్నదొర.

మల్లన్న దొర ఆ ఊరి నాయకత్వం ఎప్పుడు చేపట్టాడో ఎవరికీ తెలీదు రాజకీయంగా దేశంలో ఎన్ని మార్పులొచ్చినా ఆ ఊళ్ళో మాత్రం ఎలాంటి మార్పూ రాలేదు.

ఆ ఊరిలో సుమారుగా నాలుగొందల గడప ఉంది. అందులో సగానికి పైగా హరిజనులే.

మల్లన్న దొరది భారీ విగ్రహం, కొండలా ఉంటాడు ఇనప గుండులా ఉంటాడు. ఖరీదయిన మేలు జాతి గేదె రెండు కాళ్ళతో నడుస్తున్నట్లుంటుంది. అతని వస్తూంటే అతనావులిస్తే ఆకలితో ఉన్న సింహం నోరు తెరచి నట్లుంటుంది.

వీధిలోంచి మల్లన్న వెళ్తుంటే ఎదురుగా రావటానికి జనం జడుస్తారు. పిల్లలయితే పగలు చూస్తే రాత్రి నిదురపోరు. మగాళ్ళు అతని అధికార దర్పానికి తలొంచుతారు.

ఆ ఊరికి అతనో జియాఉల్ హక్, అయతుల్లాఖొమైనీ ఇదీ అమీన్!

ఆ ఊరికి నాయకత్వం చేపట్టేనాటికి అతను నలభైకేజీల మనిషే! నాలుగెకరాల భూస్వామే! పురిపాక నివాసియే! ఒక పెళ్ళానికి మొగుడే!

ఇప్పుడయితే నూరు కేజీల మనిషయాడు

నూరెకరాల భూమిని గడించాడు. ఇంద్రభవనంలాటి మేడ కట్టించాడు. ముగ్గురు పెళ్ళాలకు ముద్దుల మొగుడయాడు.

అతనికి చాలా కాలం వరకూ సమస్యలు లేవు ఆ తరువాత ఒకే సమస్య అతన్ని పీడించేది. అది సంతానం లేక పోవటం. కానీ ఇప్పుడు సమస్యలేదు ముద్దుల మూడో పెళ్ళాం ముచ్చటయిన మగ శిశువుని కనటంతో అతనికి చింతలేదు. చికాకులేదు బెంగలేదు. బెగుల్లేదు. బాధలేదు. భయం లేదు.

ఇంత వరకూ అతని మాట ఆ ఊరి ప్రజలకు వేదవాక్కు అతని ఆజ్ఞ సుగ్రీవాజ్ఞ! కానీ ఈ మధ్యనే అతనికో చిక్కువచ్చింది. సమస్య వచ్చింది. సమస్యలు కల్పించటమే గానీ- సమస్యల్లో చిక్కుకోవటం తెలీని మల్లన్నకు గొప్ప రోషంగా ఉంది. అతనిప్పుడు కాటేయటానికి పడగ విప్పిన గోధుమ నాగులా ఉన్నాడు ఒడుపుచూసి పంజాతో దెబ్బకొట్టడానికి సిద్ధంగా ఉన్న బెబ్బులిలా ఉన్నాడు.

ఇంతకీ జరిగిందేమంటే-

నెలరోజుల క్రితం హరిజన వాడలో ఓ మొనగాడు తలెత్తాడు ఊరికి రావలసిన కోటా సరకులేవీ హరిజనవాడకు రావటం లేదని ఫిర్యాదు చేసాడు. దానికి వాడంతా మద్దతు పలికింది. అధికార్లొచ్చారు. మల్లన్న దగ్గర కార్డులు తనిఖీ చేసారు. మల్లన్న వాళ్ళకేవో చెప్పారు. మంచి కోళ్ళను కోయించాడు. ఎన్నో సరదాలు కల్పించాడు. వాళ్ళకి నచ్చచెప్పాడు. సంతృప్తి పరిచాడు. వాళ్ళు త్రేన్పుకుంటూ తూగుకుంటూ వెళ్ళారు.

కథా నిలయం 3967 3967

ఆ తరువాత -

హరిజనవాడకి పంచదార వెళ్తోంది. నూనె కొంత అందుతోంది. బియ్యం చేరుతున్నాయి. ఒక సారి కోటా నూనె వాడిన తరువాత పేటలో జనానికి వాంతులూ, విరోచనాలు పట్టుకున్నాయి, చిన్న పిల్లలూ, ముసలాళ్ళు కాలం చేశారు. తక్కిన వాళ్ళు కొన ప్రాణాలతో బయట పడ్డారు. ఇదెలా తెలిసిందోగానీ పట్నం నిండి విజిలెన్సు వాళ్ళూ, శానిటరీ వాళ్ళూ. పత్రికా విలేకర్లూ వచ్చేసారు హరిజనవాడని పరామర్శించారు. మందులిచ్చారు.

ఆ తరువాత హరిజనవాడలో ఓ యువకిశోరానికి అధికార్లు డీలర్ షిప్‌ను బదలాయించారు. డీలరు తన ఇంటి వద్ద సరుకులు అమ్మబోతే వెళ్ళి కొనుక్కోటానికి రైతాంగం ఇష్టపళ్ళేదు. రామ్మందిరం మీదకు తెచ్చి అమ్మబోతే అందుకూ సమ్మతించలేదు. సరకులు విసరిపారేసారు దాంతో హరిజనులూ విజృంభించారు. అక్కణ్ణించీ తగాదాలు ప్రారంభమయ్యాయి. రైతుల దగ్గర పావేళ్ళుగా ఉన్న హరిజనులు సహాయనిరాకరణ చేయాలని నిశ్చయించుకున్నారు. మల్లన్న దొర పాలేరు సీమయ్య కూడా పని కెళ్ళలేదు. మల్లన్న దొర కబురు పెట్టాడు. పేట సీమయ్య వెళ్ళబోతే అడ్డు పడింది. అయినా స్వామిభక్తిగల సీమయ్యఎలాగో వెళ్ళాడు.

మల్లన్న మీసాలు దువ్వాడు. అతనప్పుడు కత్తులు నూరే కసాయి వానిలా కనిపించాడు సీమయ్యకు

"దండాలు దొరా!" అన్నాడు సీమయ్య.

" ఏరా, పన్లోకి రావట్లేదేం?" గాండ్రించాడు మల్లన్న.

" పనుల్లోకెల్లొద్దని కులపెద్దలు పెత్తనం సేసారుదొర!"

" అంత కల్లునెత్తి కెక్కినాయిరా నాకొడకా! " అని ముందు నిల్చున్న సీమయ్యని చేతిలో ఉన్న దుడ్డుతో బాదాడు సీమయ్య అతనుకొడుతుంటే తప్పుకోనూ లేదు. ఎదురు తిరగనూలేదు.

" ఎల్లురా ఎల్లు! నీ పెద్దలకు సెప్పు. ఏం సెస్తావో?"

ఆ రాత్రి పేటంతా సమావేశమయింది. తెల్లారి పోలీసుస్టేషనుకు వెళ్ళాలనుకున్నారు. అయితే ఓ అనుభవజ్ఞుడు వాళ్ళ ప్రయత్నాన్ని విరమింపచేస్తాడు. ముల్లొచ్చి అరిటాకు మీద పడినా, అరిటాకు ముల్లు మీద పడినా నష్టపోయేది అరిటాకేనన్నాడు ఆల్ల మీద మనం రిపోర్టు చేసినా, ఆల్లుమన మీద రిపోర్టు చేసినా నష్టపోయేది మనమేనన్నాడు. అందరూ ఆ రాత్రికి ఆ గారు.

అర్ధ రాత్రయింది. మాంచి నిద్రలో ఉన్నారందరూ, దోపిడీ దొంగల్లా గుర్తు తెలీని వ్యక్తులు కొందరు పేటను ముట్టడించారు. వాళ్ళొస్తూనే పడుకున్న వాళ్ళని లేపి కళ్ళలో కారం కొట్టారు. దాంతో పేట వాసులకేం కనిపించకుండాపోయింది. కళ్ళు భగ్గునమండుతోంటే హాహాకారాలూ, ఆర్తానాదాలూ మిన్నుముట్టాయి. మగాళ్ళని తాళ్ళతో కట్టేసి ఊరి చివరకు లాక్కు పోయారు. వయసులో ఉన్న ఆడాళ్ళని దారుణంగా అనుభవించి వదిలారు ఆ తరావాత హరిజనవాడ పరశురామ

ప్రీతికి గురయింది. ఆడాళ్ళు లబో దిబో మంటూ మగాళ్ళను వెతుక్కుని, ఊరు చివరతెలివి తప్పి ఉన్న వాళ్ళ కట్లు విప్పారు. కళ్ళు కన్నీటి కాల్వలు కాగా జరిగింది వివరించారు. మగాళ్ళుపేట కెళ్ళారు. అక్కడ ఇళ్ళులేవు. బూడిద ఉంది. ఊరంతా గోలగోల!

తెల్లారింది చాలామంది రైతులు ఊరు విడిచివెళ్ళిపోయారు. పట్నం నుండి పోలీసు బలగం దిగింది. కలెక్టరొచ్చారు. పత్రికావిలేకర్లూ , ఫోటో గ్రాఫర్లూ వచ్చారు. ఇంటర్వ్యూలు చేసారు. ఫోటోలు తీసారు. రాష్ట్రంలో పెద్ద సంచలనం రేపింది ఈ సంఘటన ఎన్నో సంఘాల వాళ్ళొచ్చారు. బాధితులను పరామర్శించారు. అనుమానితులను అరెస్టుచేసారు. వారిలో మల్లన్న దొరా ఉన్నాడు. మళ్ళా అందరూ జామీను మీద విడుదలయారు.

హరిజనులకు యుద్ధ ప్రాతిపదిక పై పక్కాఇళ్ళు లేచాయి. సంవత్సరం దాటింది. కేసు నడుస్తునే ఉంది. ఊరిలో మంటలు అడపాదడపా మండుతునే ఉన్నాయి.

ఓ నడిరేయి -

ఎలా అంటుకుందో, ఎవరికీ తెలీదు. ఈ సారి రైతుల కళ్ళాల మీద పంట కుప్పలకు నిప్పంటుకుని బూడిద కుప్పలయాయి. వాటిని కాపాడుకోటానికి రైతులు కళ్ళాలవేపు పరుగెత్తేసరికి ఊరిలో నిప్పంటుకుంది. ప్రళయం సంభవించినట్లు కేకలు. అరుపులూ, ఆక్రందనటూ!

బిందెల కోసం పరుగు తీసే మగాళ్ళు!

ఒకళ్ళ నొకళ్ళు చంపుకోటానికి కత్తులు నూరేరోషగాళ్ళు!

బిడ్డల కోసం తల్లడిల్లే తల్లులు తల్లుల కోసం పరుగులు తీసే పసి కూనలు?

రోదనలు, వేదనలు, పెడబొబ్బలు!

ఇదీ అప్పటి అక్కడి వాతావరణం!

మల్లన్న దొర కత్తి తీసాడు. కనిపించే పేట వాసిని నరికి పారేయటానికి పరుగుతీస్తున్నాడు.

ఇంతలో అతని పశువులసాలకు నిప్పంటుకుంది పంటలు దగ్ధమవుతున్నాయి. ఎవరిగోల వారిది! మంటల నార్పటానికి పశువుల సాల దగ్గరకు సీమయ్యవచ్చాడు. మల్లన్న దొర మూడో పెళ్ళాం ఆమె కన్నారింటి నిండి పరుగు పరుగునవస్తోంది. సీమయ్యకాళ్ళు పట్టుకుంది.

"సీమయ్యా! నాబిడ్డడు లోనుండిపోండు మొగాళ్ళు ఎవరూనేరు. నాబంగారు తండ్రిని రచ్చించు సీమయ్యా! నీ కాళ్ళోట్టుకుంటాను" ఏడుస్తోంది.

సీమయ్య ఒళ్ళు జలదరించింది. అతని గుండెల్లో మంటలు చెలరేగాయి ఆ మాతృమూర్తి ఆవేదన అతన్ని కదిలించింది చుట్టూ మంటలు ముసురుకుంటున్నాయి. పొగలు చీకటిలా వ్యాపిస్తున్నాయి. లోపలికెలావెళ్ళాలో తెలీటం లేదు. ఒక్క దూకు ముందుకు దూకబోయాడు బలమైన చేతులు అతన్ని ఆపాయి. "ఒద్దు ఎళ్ళొద్దు, నిన్నూ నీ ఆడోళ్ళీ సెడగొట్టెన ఈడి వంశం బూడిదైపోవాల్సిందే ఈణ్ణి రచ్చించకు ఆడలాగా కాలిపోనీ," అన్నాడు ఆమాట అన్నది కులపెద్ద వెనక్కి చూసాడు సీమయ్య అతనికప్పుడెవరిమీదా కోపం లేదు. కసిలేదు. పగలేదు. ద్వేషం

లేదు. తన వంశాంకురం, కన్న పేగుకాలిపోతున్నదన్న ఆవేదనతో కుమిలి పోతున్న తల్లి కనిపించింది. ఆలోచించలేదు. విసురుగా మంటల్లోకి ఒక్క దూకు దూకాడు. లోపల పిల్లాడు ఉక్కిరి బిక్కిరయిపోతున్నాడు. మీద నిప్పురవ్వలు పడుతుంటే గగ్గోలు పెడుతున్నాడు.

చుట్టూ చూసాడు సీమయ్య అక్కడ మూలన బట్టల బుట్ట కనిపించింది కుర్రాణ్ణి అందులో దించేసాడు అంతలో కాలుతున్న కమ్మలు మీదపడ్డాయి. ముందుకు గెంతాడు అదో కొలిమిలా ఉంది. కాలికేదో తగిలి పడిపోయిడు. ఒళ్ళంతా మంటలు అగ్ని గుండం త్రొక్కుతున్నట్టు అడుగులేసుకుంటు బయటపడ్డాడు. బయటకు రాగానే పడిపోయాడు బట్టల బుట్టపడేసాడు అందులోంచి కుర్రాడు బయట పడ్డాడు. సీమయ్య ఒళ్ళంతా కాలిపోయింది. బాధతో మెలికలు తిరుగుతున్నాడు. నోరెండిపోతోంది.

" దాహం" " నీళ్ళు" సైగ చేసాడు నోటమాటరాక మల్లన్న దొర పెళ్ళాం పరుగెత్తి వెళ్ళి ముంత తో నీళ్ళు తెచ్చింది. సీమయ్య అచేతనంగా నేలమీద పడి ఉన్నాడు తన కొడుకును రక్షించిన ఆ దేవుడి తల ఒళ్ళో పెట్టుకుని నోట్లోనీళ్ళుపోస్తోంది.

ఒక్కసారి ఆమె చేతిలో చెంబు ఎవరో కాలితో తన్నిన తాపుకి దూరంగా ఎగిరి పడింది. ఆమె రౌద్రంగా వెనుదిరిగింది. చూస్తే మల్లన్న "ఏటీ? నువ్వు పేస్తన్నావు నెగు ఎల్లు ఇంకా ఇక్కడ కనిపించినావో మంటల్లోకి తోసేస్తాను." యమునిలా మల్లన్న

" దొరా! మంటల్లోంచి మన బిడ్డణ్ణి కాపాడింది సీమయ్యే " ఆమె ఇంకా ఏమో చెస్తోంది.

"తప్పుకో. నాకేం చెప్పొద్దు" అన్నాడు మల్లన్న

అప్పుడే అక్కడకి వచ్చి అంతా చూస్తున్న సీమయ్య బావమరిది పళ్ళు పటపటా కొరికాడు. మనిషి చలించిపోయాడు ప్రతీకార జ్వాలతో మండిపోయాడు వెంటనే ఏదో ఆలోచన వచ్చింది.

"ఒరేయ్ నీ తరువాత నీ కుటమానంలో మరెవుల్నీ మిగల నివ్వన్రా!" అన్నాడు అంతే! అక్కడున్న మల్లన్న దొర పెళ్ళాం చేతుల్లో బిడ్డను బలవంతంగా లాక్కున్నాడు. ఆలోచించకుండా మంటల్లోకి విసిరేసాడు.

" అ.... మ్మో!" మల్లన్న పెళ్ళాం నేలకొరిగిపోయింది. సీమయ్య ఆ దృశ్యం చూళ్ళేక కళ్ళు మూసేసాడు. మల్లన్న ప్రళయకాల రుద్రుడయాడు.

అయితే - మంటలు మాత్రం చల్లారలేదు. అవి నిరంతరం మిన్ను ముడుతునే ఉన్నాయి. (ఉదయం ఆదివారం అనుబంధంనుండి).

❁ ❁ ❁ ❁